# లాభనష్టాలు

నాకేం తోచలేదు...

గుర్రప్పందాలలో యావదాస్తీ, నష్టం కావచ్చు. అందుకు విచారించవలసిన పని లేదు.

సభ్యత్వం వున్న భీమాసంస్థ-హఠాత్తుగా దివాలా తీయవచ్చు. అందుకు బాధపడవలసిన అవసరం లేదు...

కాని, నిండు నెలరోజులు కుటుంబానికి ఆధారమైన జీతపు సొమ్ము-దారిలో హఠాత్తుగా మాయమయితే-మధ్య తరగతి కుటుంబీకుడి గతి యెలా వుంటుందీ-అంటే, అది అనుభవించిన వాడికే తెలియాలి!

దగ్గరున్న పోలీస్-స్టేషన్‌కు వెళ్లాను. సబ్-ఇన్‌స్పెక్టరు తీవిగా దర్శనమిచ్చారు. వాడిపోయిన వదనంతో వందనం చేశాను. విచిత్రంగా-నాకేసి చూడకనే-"చెప్పండి!" అన్నారు.

దిగులుతోనూ, విచారంతోనూ-తడబడుతున్న మాటలను ఓపిగ్గా కూడదీసుకుని-నాలుగు ముక్కల్లో చెప్పాను:

"మా కంపెనీలో జీతం తీసుకుని వస్తున్నాను. జేబులో పెట్టుకున్న ఆ జీతపు సొమ్మును-ఆ నూటపదినీ - దారిలో ఎవరో కొట్టేశారు..."

ఈసారి ఇన్‌స్పెక్టరు నావేపు చూశారు. ఆ చూపులో అవహేళన, వ్యంగ్యం, జాలి అనే రంగులు వెలువడ్డాయి. అట్టే సేపు ఆయనవేపు చూడలేక ముఖం దించుకున్నాను. "మిస్టర్" అని ఆయన నన్ను పలకరించేంతవరకూ - ఆయన వేపు నేను చూడలేదు.

"ఐయామ్ వేరీ సారీ... ఇప్పుడిలాటి కేసులు జరగడం అధికమయిపోయింది. అలాటి దొంగల్ని పట్టుకోడానికి మా శాఖవారు ఎప్పుడూ ప్రయత్నిస్తూనే వుంటారు. మీ విషయంకూడా దర్యాప్తు చేస్తాం.... రిపోర్టు రాసిచ్చి వెళ్ళండి..." అని, ఓ కాగితం నా ముందు విసిరారు...

'అంతే గాబోలనుకున్నాను...

నా వేళ్లు, కలాన్ని ఆ కాగితంమీద నడిపాయి...ఆగాయి.

లేచాను...బయటికి నడిచాను...

లోకంలో-చీకటి తెరలు కొద్ది కొద్దిగా అల్లుకుంటున్నాయి. అక్కడక్కడా విద్యుద్దీపాలు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి...

'ఏం చేస్తావ్?' అన్నది లోకం.

'ఇంటికి వెళ్లు' అన్నది మనస్సు. కాని...

ఇంటికాడుగ అడిగితే ఏం చెప్పాలి?... పాలవాడికి, పెరుగువాడికి, ఇంటిసామానుల అంగడివాడికి, మిగతా చిల్లర అప్పులవాళ్ళకి యేం చెప్పాలి?—నా జీతపు డబ్బులు యెవడో జేబుదొంగ కొట్టేశాడంటే, నమ్మేదెవరు? అబద్ధాలాడి అప్పు చేసుకో మాస్తానని కొందరు—ప్రత్యక్షంగా కాక పరోక్షంగా చెప్పుకుంటారు! ఈ నిందల మధ్యలో నా అవస్థ యెలా వుంటుంది?...

సి. డి. యస్.
రామయ్య

మనస్సును మానం ముంచింది...కాళ్లు నడకను సాగించాయి. జీవితపు వెలుగునీడల్ని గురించి చర్చిస్తోంది నా అంతరాత్మ...

ఇరవయ్యో నిమిషానికి, నా రెండు కాళ్లు మా యింటి గుమ్మం తొక్కాయి...నా బాధను శారదకు యెలా వివరించాలా అని అనుకున్నప్పుడు—నా ఒంట్లో షాక్ తగిలినట్టనిపించింది. ఒళ్ళు దులుపుకున్నాను. మనస్సును స్థిమిత పరుచుకున్నాను. ముందడుగు వెయ్యమని నా కాళ్లకు ఆజ్ఞాపించాను...

వాకిలి తలుపు మెల్లగా తీశాను... మోహను దీపంముందు కూర్చుని, బొమ్మల పుస్తకం చూస్తున్నాడు...శారద?

"అమ్మా!...నాన్నొచ్చేశాడమ్మా!" అని రైలు కూతలా కేక వేశాడు మోహను. ఐదేళ్ళకుర్రాడు అలాగేనా అరవడం? అనుకున్నాను.

"ఏమండోయ్!..." అంటూ వంట వాకిలినుండి అర్ధాంగి కంఠం జవాబిచ్చింది. "స్నానం చేస్తున్నా...నిమిషంలో వస్తాను. కూర్చోండి."

ఎవరినీ పలకరించే స్థితిలో లేనప్పుడు... మెల్లగా మంచంమీద వాలి, కాసేపు కునుకు తీయాలని తోచింది. అందుకని, నా గదివేపు నడవబోయి...నాలుగడుగులు వేసి...

అంతలో నా దూపు కూజమంచమ్మీదున్న ఒకవస్తువుమీద పడ్డంతో—నా నడక ఆగిపోయింది...అది బీగాలగుత్తి!...

మంత్రముగ్ధుడిలాగా—దాన్ని చూడ్డంతోటే—నా బుర్ర బద్దలయిపోయింది... బద్దలయిపోయిన ఒక్కొక్క ముక్కలోనూ ఒక్కొక్క ఆలోచనా మెరుపులాగా పుట్టుకొచ్చింది ... అంతా ఒక్క నిమిషంలోనే జరిగిపోయింది.

ఆ ఆలోచన పుట్టుకొచ్చేసరికి—నాలో ముచ్చెమటలూ పోశాయి...గుండె గతుక్కుమన్నది. అంతరాత్మ తప్పు అన్నది—కాని, వేరేగత్యంతరం లేదు అన్నది మనస్సు.

గుండెరాయి చేసుకుని, ఆ బీగాలగుత్తిని చేతికి తీసుకున్నాను. మోహను ఒకసారి నావేపు పరీక్షగా చూసి వూరుకున్నాడు. వడివడిగా వెళ్ళి మరోగదిలోని శారద బీరువ తీశాను...బీరువమధ్య భాగంలోని కుడివేపు సొరుగులో చిన్న పెట్టె తీశాను...తెరిచాను. అందులో నిరపాయంగా నిద్రించే రెండు పేటల బంగారుగొలుసు కనిపించింది. దాన్ని చేతికి తీసుకున్నాను...

'అది శారద సొత్తు...దానిని అమ్మి, సొమ్ము చేసుకోడానికి, అదీ శారద సమ్మతి లేకుండా, చేయడానికి - నీకేం అధికారముంది? నీభార్యకు ద్రోహం తలపెట్టావా?'- బీరువా అద్దంలో ప్రతిబింబం నన్ను ప్రశ్నించింది. పెదిమలు కొరుక్కున్నాను... అంతలో నా మనస్సుకు ఆ వేళ మెచ్చింది!

'ఇది శారద సొత్తే కావచ్చు...కాని, మానం పోతున్న అపత్సమయంలో ఉపయోగపడని ఆభరణం దేనికి? ఇలాంటి దేనికి? కాలము కలిసివస్తే-ఇలాటి ఆభరణాలు కూటపదార్లు చేసుకోవచ్చు...అంతమాత్రానికే-నా మంచిచెడుగుల తతంగం శారద కనుక్కోగలదని తెలుసు. ఊరుకో!'—

నాలో లేని బలమొచ్చింది...ఆ ఆభరణాన్ని జేబులో వేసుకుని, బీరువా తలుపులు మూశాను...పిదప, ఆ బీగాల గుత్తిని వాకిట్లో దీపం ముందు కూర్చున్న మోహను ముందు పడేసి — "ఇప్పుడే వస్తానని అమ్మతో చెప్పూ!" అని చెప్పి, బయటికి చరచరా వచ్చేశాను...

బజారుకి వెళ్లి ఆ ఆభరణాన్ని అమ్మేశాను...ఆ విచారాన్ని వ్యక్తపరుస్తూ - నా కళ్ల నుండి రెండు నీటి బొట్లు రాలాయి.



"మధుర స్మృతులు"
చిత్రకారుడు: రావాడ కృష్ణ, —వుల్లేటికుర్రు.

అమ్మగా వచ్చిన రెండువందల ఇరవై రూపాయలనూ—ఈసారి కూడా జేబుదొంగల ముహూర్తాలకు కాలుగాకుండా-జాగ్రత్తగా భద్రపరుచుకున్నాను... అలా నడిచి వస్తుంటే 'గోల్డ్ కవరింగ్' కొట్టు కనిపించింది...ఆ కొట్టులో ప్రవేశించి - ఇంతకు ముందు పోగొట్టుకున్న - శారదకు సొంతమైన రెండుపేటల బంగారు గొలుసు లాంటిదే - మరొకటి (నకిలీది) కొన్నాను. పద్దెనిమిది రూపాయలని కొట్టువాడు చెప్పినా-నాకు ఆ సమయంలో బేరమాడాలనిపించలేదు.

త్వరత్వరగా ఇంటికి వచ్చేసరికి-ఆ దీపం ముందే మోహను కూర్చుని, పుస్తకాలు చూస్తున్నాడు...అమ్మ యేదని అడిగాను.

దేవాలయానికి వెళ్ళిందన్నాడు...గండం గడిచిందన్నట్టు తృప్తిగా నిట్టూర్చాను... అక్కడే వున్న బీగాలగుత్తి సహాయంతో బీరువా తీసి-పూర్వం బంగారు గొలుసున్న సింహాసనంలో నకిలీ బంగారు గొలుసును పెట్టేశాను. ఈ సారి అద్దంలోని నా ప్రతిబింబం-నన్ను చూసి నవ్వినట్టయింది. అయితే, నా మనస్సు మాత్రం - "'ధైర్యే సాహసే లక్ష్మీః' అన్న పెద్దల మాటలను నిరూపించావు శివరాం" అని సమర్థించింది.

* * *

వారంరోజుల తర్వాత—అన్నం ముందు కూర్చున్న ఒకానొక సమయంలో—

"ఏమండీ! ప్రయాణంగురించి యేమాలోచించారూ?" అని ప్రశ్నించింది శారద!

"రాజమండ్రి వెళ్ళేవిషయమే గదూ!" అన్నాను. వాళ్ళబాబాయి కొడుక్కి పెళ్ళి ముహూర్తం నిశ్చయం చేశారు. ఇంకా పది రోజులుంది గాబట్టే శ్రీమతి నాకు జ్ఞాపకం చేసింది!

"అవును. వారంరోజులకు ముందుగానే మనల్ని రమ్మని చెప్పి, వెళ్ళారుగదండీ—బాబాయి!...అందుకే ప్రయాణం యెప్పుడు నిశ్చయంచేశారూ అని అడుగుతున్నా..." అంది శారద.

"ఇదిగో, చూడు—శారదా! మా కంపెనీ మేనేజరు పచ్చికసాయివాడు...ఇంకో నెల వరకూ—యెవరికీ, సెలవులు—ఒక్కరోజయినాసరే—ఇవ్వబోవడం లేదని బల్లగుద్ది చెప్పేశాడు...ఈ పరిస్థితులలో—రాజమండ్రికి నేనెలా రాగలను?—కాబట్టి, నువ్వూ, అబ్బాయీ వెళ్ళిరండి!"

నిమిషంపాటు శ్రీమతి ముఖం విచార పూరితమై, పాలిపోయింది. తర్వాత—నిట్టూర్చి—"సరే—మీ యిష్టం! ఆడదాన్ని... నేనేం చెప్పగలను మీకు?" అంది.

మరునాటిరోజు శారదా, మోహను రాజమండ్రికి ప్రయాణమయ్యారు...వాళ్ళను బండిలో సాగనంపి వచ్చాను.

నిజం చెప్పాలి, మరి—మామూలుగా, పండుగదినాల్లోగానీ, ఏదైనా విశేషమున్న రోజుల్లోమాత్రమే శారద తన ఆభరణాలను అలంకరించుకునేది. కాబట్టి, రాజమండ్రి ప్రయాణమవుతూ—ఆ (నకిలీ) బంగారు గొలుసునుగూడా—మిగతా నగలతోపాటు అలంకరించుకుంది...కాని, బండి కదిలేటంతవరకూగూడా—ఆమె ముఖంలో, ఏ సందేహాలకూ, అనుమానాలకూ చోటున్నట్టు నాకు అనిపించలేదు.

* * *

ఇరవై రాత్రిళ్లు గడిచిపోయాయి...

మా శ్రీమతీ, అబ్బాయీ—యింటికి తిరిగి చేరారు...

పెళ్ళిబాగానే జరిగిందట...నేను రాలే

దని వాళ్ళబాబాయి కొత్తకోప్పడ్డాడట... బాగుందనుకున్నాను...

ఆ సాయంత్రం ఆఫీసునుంచి వచ్చాక—వాడుకగా—శారద నాకు కాఫీ అందించింది... కాఫీఅందుకోబోతూ—అందంగా వున్న నా అర్ధాంగిముఖాన్ని చిరునవ్వుతో పలకరించాను. ఆవిడ అర్ధనిమీలిత నేత్రాలతో ఆప్యాయంగా జవాబిచ్చింది.

"ఇంకా ప్రయాణపు విశేషాలు ఏమైనా వున్నాయా?" అంటూన్నంతలో నాచూపు శ్రీమతి కంఠంచుట్టూ దేన్నో వెదికింది. కాని కనిపించలేదు. అది నేను బహూకరించిన (నకిలీ) బంగారు గొలుసు!

"బంగారు గొలుసేదీ?" అని ప్రశ్నించాను... నాకంఠంలో కొంత కర్కశత్వం వినిపించింది గాబోలు; నా నేత్రాలనించి కోపారుణిమ బయటపడింది కాబోలు!

శారద బిత్తరపోయింది. ఆమె ముఖంలో వివర్ణత వర్ణించలేనంతగా అల్లుకుంది. అది యేదో అపాయ సూచన అని నాకు తెలుసునని ఆమెకు తెలీదు. ఆమె మౌనం వహించింది. ఆ మౌనం అంగీకార సూచకమేగాక అనుమానాస్పదం అని గూడా నాఅంతరాత్మ అనుమానించింది.

"గొలుసేది అని అడుగుతుంటే వినబడ్డంలా! ఏమిటి విషయం?"—భర్త అనే భారమైన అధికారాన్ని ఈసారి గర్వంగా ప్రదర్శించాను.

శారద ముఖమెత్తి చూసింది. "చెపుతాను. కోపగించుకోరుగదా?"— అని దోషిలా పలకరించింది.

"కోపం దేనికి?— నమ్మతగ్గదైతే?—"

నస్యంలో మిరపొడి కలిపి పీల్చినట్టు—నా శరీరం మండింది.

"నామాటల్ని మీరు నమ్మగలరనే నమ్మకంతోనే నేను నిజంచెపుతున్నా. ఆ బంగారు గొలుసు పోయింది..." (ఇక్కడ నాశరీరం రోమాంచితమైంది.) "పెళ్ళిజరుగుతున్న సమయంలో మా బాబాయి మూడో కూతురు జలజ— నా మెళ్ళోని గొలుసును వేసుకోవడాని కిమ్మని అడిగింది. ఏదో—పసిపిల్ల ముచ్చటపడిందని దాని మెళ్ళో వేశాను...తీరాకొంతసేపటి తర్వాత చూస్తే ఆగొలుసు దాని మెళ్ళోలేదు. ఏదని అడిగితే ఎవరుతీసుకున్నారో నాకు తెలీదని ఏడ్పు ముఖంపెట్టింది. బాబాయి దగ్గర చెప్పాను. ఆపిల్లని నాలుగుకొట్టి, తర్వాత ఇంకోవారం రోజులలో అలాటి గొలుసును—బంగారం కొని కంసాలిచేత చేయించి పంపుతానని నాకు మాటిచ్చాడు. అదీ సంగతి..."

అంతా విన్న తర్వాత కొంతసేపటివరకూ నా మనస్సు మూగబోయింది. నాహృదయం చైతన్యం తప్పింది ... అది నాకు సరిగా తెలీదుగూడా!

"ఇప్పటికైనా నమ్ముతారా నామాటల్ని!" అని శారద నన్ను పలకరించేంత వరకూ నాకీ లోకమే గుర్తులో లేదు...హరి భగవంతుడా! ఎంత ఉపకారివిరా! ఆయాసపడి అగచాట్లు పడి, ఆప్యాయతతో నా అర్ధాంగికి కొని పెట్టిన పద్దెనిమిది (పదులూ గాదు, వందలూ గాదు) రూపాయల బంగారు (పూత) గొలుసును తొలగింపచేసి-ఆఖరికి వాళ్ళ బాబాయి చేత (అసలు) బంగారు గొలుసును కొనిపెట్ట దలిచావురా! ఈ నష్టాన్ని నష్టపరిచి—లాభాన్ని లభింపచేసిన నీకు ఎన్ని (కోట్లయినాసరే) నమస్కారాలు పెట్టినా చాలదు గాబోలు!...థేంక్ గాడ్!...

నానుండి నిటూర్పు విడివడడం గమనించి—శ్రీమతి తనొక నిట్టూర్పు విడిచింది. (కూడి రక్తసంబంధం గదా, మరి!)

"శారదా! ఒకమాట! అది నీసొత్తు! నువ్వే పోగొట్టుకున్నావ్! అయినా అడగవలసిన బాధ్యత వుందిగాబట్టి అడిగాను. నువ్వా చెప్పావు! అంతేగాని—పోయినసొమ్ము యెలాగో పోయింది అనుకో!—మీ బాబాయిమాటలు నువ్వు నమ్మగలిగితే, ఇందులో నాకే అభ్యంతరమూ లేదు..."అని పెదిమలు విరిచి వూరుకున్నాను.

క్షమించడం మానవ సుగుణం అని నీతివంతులు నీతికథల్లో రాశారు. ఆ కథలపై అభిమానంకొద్దీ—నేను శారదను క్షమించానని ఆమె సంబరపడింది...ఆ సంబరంలో నన్ను ...ఇష్! అవన్నీ ఇక్కడ రాయగూడదు.

పెద్దలు వూరికే అన్నారా—'అంతా మనమంచికే' అని!

* * *

"మీ పేరేనా—శివరాం!" అనే పిలుపు విని, ఉలిక్కిపడి—రాస్తున్నకలం అవతల పెట్టి—ముఖంపైకెత్తి-ఎదురుగా చూశాను. పోస్టుజవాను చిరునవ్వుతో పలకరించాడు. "అవును. నేనే! ఏమిటి విషయం?" అన్నాను.

"మీకు ఏదో కవరువచ్చిందండి!"—అని అతనన్నమాటలు నా చెవుల్లో సరిగా వినిపించలేదు. అతను మళ్ళీచెప్పి, ఇన్స్యూర్—కవర్ నా చేతికిచ్చి, అక్నాలడ్జిమెంటులో నా చేవ్రాలు తీసుకు వెళ్ళిపోయాడు...

కవరు విప్పాను...అందులో ఒక వుత్తరమూ — మూడు వందరూపాయలనోట్లూ వున్నాయి...ఆ వుత్తరంలో—

"శ్రీ శివరాంగారికి— నేను జేబుదొంగని—కాని, లోకంయెరిగినవాణ్ణి!...అప్పటి పరిస్థితుల్నిబట్టి—మీసొమ్ము కాజేయవలసి వచ్చింది. 'పర్స్' తో పాటు—నాకు చిక్కింది! మీనుండి లభించిన సొమ్మువల్ల—నాకు గుర్రప్పందేలలో పదివేలు లాభించాయి. కాని, మీ స్థితి మరిచిపోలేదు... మీ జీతపు మొత్తాన్ని కాజేయడంవల్ల—మీ సంసారం జీవితంలో కలిగే ఇబ్బందులు వూహించాను. అందుకే మీ సొమ్మును రెట్టింపుగా పంపుతున్నాను. మీ చిరునామా—మీ పర్సులోనే వుండిపోవడం మంచిదయింది. నేపంపిన సొమ్మును దయచేసి స్వీకరించండి. మీ జ్ఞాపకార్థం మీ 'పర్స్' నా దగ్గరే వుండడంలో అభ్యంతరం లేదనుకుంటాను. సెలవు—

జేబుదొంగ,
జయరాం."—

ఉత్తరం సాంతం చదివి, ఆశ్చర్యపోయాను; ఆనందించాను. జేబుదొంగల్లోగూడా నిజాయితీపరులున్నట్లు—నలుగురివద్దా చెప్పాను.

కాని, నా శ్రీమతిదగ్గరమాత్రం చెప్పలేదు. ఎందుకో నాకు తెలీదు. అయితే—చీకటి వెనక వెలుగు వస్తుందన్నట్లు—నష్టాలు లాభాలూ జీవితపు వెలుగు నీడలని—నా శ్రీమతికి అప్పుడప్పుడూ బుద్ధి చెప్పేవాడిని.

నెలరోజుల తర్వాత శ్రీమతిచేతుల్లో జత బంగారు గాజులు తళ తళ లాడాయి, మరి—నాకో!

తృప్తి! అర్ధాంగికి చేసిన అపచారానికి—ఆత్మశుద్ధిగా ప్రతిఫలం ముట్టచెప్పాననే తృప్తి! ★




మరియు హైదరాబాదు.

